ఆర్యనగర్‌లో గణపతి మండపం నిర్మిస్తా



త్రినేత్ర గౌడ్‌ను కలిసిన ఆర్యనగర్ వాసులు

లాలాపేట: తార్నాక డివిజన్ శాంతినగర్ ఆర్యనగర్‌లో తన సొంత ఖర్చులతో గణపతి మండపాన్ని నిర్మిస్తానని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ తనయుడు త్రినేత్ర గౌడ్ తెలిపారు. సోమవారం ఆర్యనగర్ వాసులు ఆయనను కలిసి ఆర్యనగర్‌లో నెలకొన్న పలు సమస్యలను, చేపట్టాల్సిన మరమతు పనులను వివరించారు. వాటి పరిష్కారానికి ఎమ్మెల్యే ద్వారా కృషి చేయాలనీ కోరారు. దీంతో పాటుగా ఆర్యనగర్ యూత్ నాయకులు తమకు గణపతి మండపాన్ని కట్టించాలని కోరడంతో వెంటనే త్రినేత్ర గౌడ్ సానుకూలంగా స్పందించారు. అందుకు ఆర్యనగర్ వాసులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో గొల్లపల్లి నరహరి, హరి, దేవయ్య, చిన్న, రఘు, జగదీష్ తదితరులున్నారు.

రేపటినుంచి 'శ్రీమద్భాగవతం' ప్రవచనాలు

సనత్‌నగర్: మోడల్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 25, 26 స్థానిక సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ 'శ్రీమద్భాగవతం' ప్రవచనం ఉంటుందని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బుచ్చిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. బుధ, గురువారాల్లో సాయంత్రం 6 గంటలకు ప్రవచనం ప్రారంభమవుతుందన్నారు.

జీటీఎస్ దేవాలయం హుండీ ఆదాయం రూ.1,79,339



నగదును లెక్కిస్తున్న భక్తులు

వెంగళరావునగర్ : వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని జీటీఎస్ కాలనీలోని శ్రీ వీరాంజనేయ భవానీశంకర అయ్యప్పస్వామి సాయిబాబా దేవస్థానం హుండీ ఆదాయం రూ.1,79,339లు వచ్చింది. సోమవారం జీటీఎస్ టెంపుల్ హుండీని అధికారుల సమక్షంలో మహిళా భక్తులు లెక్కించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ మధుబాబు, కార్యనిర్వహణాధికారి జి.సుధాకర్, ఆలయ పూజారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్, ఈ.ఓలు మాట్లాడుతూ భక్తులు సమర్పించిన నగదును దేవాదాయశాఖ నిబంధనల ప్రకారం ఆలయ అభివృద్ధికి వెచ్చించనున్నామని పేర్కొన్నారు. కాగా గత రెండున్నర రెండున్నర నెలలకు గాను ఈ ఆదాయం వచ్చిందని అన్నారు. త్వరలో జరగనున్న అమ్మవారీ నవరాత్రి ఉత్సవాలను కూడా అత్యంత వైభవంగా జరుపనున్నట్లు పేర్కొన్నారు.

ఇక్సోరా కాంట్రాక్టును రద్దు చేయాలి

పంజగుట్ట: మల, మూత్ర శాలల మాటున అక్రమార్జనకు పాల్పడుతున్న సంస్థపై చర్యలు తీసుకోవాలని బాధితులు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భాధితులు సామ్యూల్, సాయి గణేష్, అనీల్, జ్యోతినాథ్‌లు మాట్లాడుతూ గత ప్రభుత్వం జీహెచ్‌ఎంసీ వివిధ సర్కిల్స్‌లో, పర్యాటక ప్రాంతాల్లో, ఎక్కువగా రద్దీ ఉండేచోట మరుగుదొడ్ల ఏర్పాటుకు కాంట్రాక్ట్‌కు పిలుపునిచ్చిందని తెలిపారు. దీంతో ఇక్సోరా కార్పొరేట్ సర్వీసెస్ ఈ టెండర్‌ను దక్కించుకుందని, జీహెచ్‌ఎంసీ టాయిలెట్‌లకు జోడించబడిన వాణిజ్య షాపులు ఏర్పాటుకు ఒక్కోదానికి మూడు లక్షల నలభై వేలు కేటాయించి నీరు, విద్యుత్, డ్రైనేజీ సిస్టమ్ అన్ని జీహెచ్‌ఎంసీనే ఇచ్చిందిని తెలిపారు. సదరు వాణిజ్య షాపులో వ్యాపారం చేసుకునే వారు మరుగుదొడ్ల మెయింటనెన్స్ చేసుకుని వ్యాపారం చేసుకున్నందుకు ఎలాంటి అద్దె చెల్లించకుండా ఒప్పందం చేసుకుందన్నారు. ఇలా ఒక్కో డివిజన్‌లో 13 చొప్పున 150 డివిజన్లల్లో అందుబాటులోకి తెచ్చిందన్నారు. టాయిలెట్ బాక్సులు ఏర్పాటు చేసిన ఇక్సోరా సంస్థ వారు ఒక్కో షాపునకు రూ. 10 వేల నుంచి రూ. 40 వేలు అద్దె వసూలు చేస్తున్నారని, అంతే కాకుండా రద్దీ ప్రాంతాల్లో, పర్యాటక ప్రాంతాల్లో వీటిపై యాడ్స్ వేసుకుని వాటి ద్వారా కూడా వసూళ్లు చేస్తున్నారన్నారు. అధికారులకు ఎన్నో సార్లు ఫిర్యాదు చేశామని అయినా పట్టించుకోవడం లేదన్నారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన ఈ కాంట్రాక్ట్‌ను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

త్వరలో సైట్-3 శ్మశానవాటిక అధికార కమిటీ ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న బస్తీ నాయకులు

రహమత్‌నగర్ (బోరబండ): త్వరలోనే బోరబండ సైట్-3 శ్మశాన వాటిక జీహెచ్‌ఎంసీ అధికార కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందని బస్తీ నాయకులు వెల్లడించారు. ఈ మేరకు సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రహమత్‌నగర్, బోరబండ డివిజన్‌లకు చెందిన హిందు, క్రైస్తవ మతాలకు ప్రతినిధులతో అధికార కమిటీని ఏర్పాటు చేసుకుని శ్మశాన వాటికలను అభివృద్ధి చేసుకుంటామని తెలిపారు. ఈ క్రమంలోనే బోరబండ, రహమత్‌నగర్ కార్పొరేటర్లతో మరో మారు సమావేశమై తుది నిర్ణయ తీసుకుంటామన్నారు. శ్మశాన వాటిక అభివృద్ధికి తమ సహాయ, సహకారాలు అందిస్తామని పీజేఆర్ ఎస్పీఆర్‌హిల్స్ ఉమ్మడి బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేముల యాదయ్య, నాయకులు బా లయ్య, రాగిని యాదగిరిలు, వెంకటేశ్‌లు స్పష్టం చేశారు. బోరబండ డివిజన్ నాయకులు చెన్నయ్య, దాసరి సతీష్, యాదవరెడ్డి, క్రైస్తవ మత పెద్దలు స్వామిదాస్, కృపాసన్నిధి, సత్యానందం, పాస్టర్ మోజస్ తదితరులు పాల్గొన్నారు.

- ప్రారంభం కాని ఆర్‌యూబీ నిర్మాణం
- మూడేళ్ల క్రితం రూ.20కోట్లు మంజూరు
- పట్టాలు దాటుతూ ప్రయాణం



మాణికేశ్వరినగర్-సీతాఫల్‌మండి ప్రాంతాల మధ్య ఉన్న రైల్వే ట్రాక్

దూరాభారం తగ్గేది ఎప్పుడు?

సికింద్రాబాద్: మాణికేశ్వరినగర్-సీతాఫల్‌మండి ప్రాంతాల ప్రజల రాకపోకలకు దూరాభారం తగ్గే పరిస్థితులు కనుచూపు మేరలో కనిపించడం లేదు. ఈ రెండు ప్రాంతాలు చూడడానికి రైలు పట్టాలకు ఇరువైపులా ఉంటాయి. పక్కపక్కనే రెండు ప్రాంతాలు ఉన్నప్పటికీ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లడానికి 6 కిలో మీటర్ల దూరం ఉంటుంది. రెండు ప్రాంతాల ప్రజల ఇబ్బందులను తొలగించడానికి జీహెచ్‌ఎంసీ అధికారులు వంతెన నిర్మాణం పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రూ.20 కోట్ల నిధులు కేటాయించి మూడేళ్లు గడిచిపోయినా పనులు ప్రారంభం కాలేదు.

భవనాల తొలగింపు సర్వే పూర్తి

ఆర్‌యూబీ నిర్మాణం కోసం జీహెచ్‌ఎంసీ అధికారులు ఒక సర్వే నిర్వహించారు. ఇందుకోసం 18 ప్రైవేటు భవనాలు తొలగించాలని నివేదికను సిద్ధం చేశారు. సీతాఫల్‌మండి వైపు 10 భవనాలు, మాణికేశ్వరీనగర్‌వైపు 8 భవనాలను తొలగించాల్సి ఉందని పేర్కొన్నారు. భవన యజమానులకు నష్టపరిహారం అందించేందుకు సన్నాహాలు చేశారు. ఆ తరువాత అధికారులు తీసుకున్న చర్యలు ఏవీ లేవు. ఆర్‌యూబీ నిర్మాణం కోసం తాము మూడు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్నామని మాణికేశ్వరీనగర్ వాసులు చెబుతున్నారు. వంతెన వస్తే రెండు ప్రాంతాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, పట్టాలుదాటుకునే ప్రమాదకర పరిస్థితులు దూరం అవుతాయని వారు అంటున్నారు.

పట్టాలు దాటుకుని ప్రయాణం....

ఈ రెండు ప్రాంతాలను వేరుచేస్తూ సీతాఫల్‌మండి-ఆర్ట్స్ కళాశాల రైల్వేస్టేషన్లు ఉన్నాయి. రెండు స్టేషన్లను అనుసంధానం చేస్తూ రైల్వే ట్రాక్ ఆవరించి ఉంది. ఫలితంగా రెండు ప్రాంతాల మధ్య నేరుగా రవాణా మార్గం లేకుండా పోయింది. వాహనాలు కలిగిన వారు మాణికేశ్వరినగర్ నుంచి సీతాఫల్‌మండి ఫ్లై ఓవర్ మీదుగా సీతాఫల్‌మండి, ఇందిరానగర్, వారాసీగూడకు రావాల్సి ఉంది. లేదా ఓయూ డిస్టెన్స్ సెంటర్ మీదుగా వారాసీగూడ, బౌద్ధనగర్‌కు చేరుకోవాల్సి ఉంటుంది. వాహనాలు లేని వారు మాత్రం తప్పనిసరి పరిస్థితుల్లో ప్రమాదకర పరిస్థితులు అధిగమించి ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి చేరుకోక తప్పడం లేదు. వచ్చిపొయ్యే రైళ్లను, రైలు పట్టాలు దాటేసి ఒక ప్రాంతం నుంచి మరోవైపుకు చేరుకుంటున్నారు.

దశాబ్దాలుగా ఇదే తీరు.....

రైలు పట్టాలు వేసిన రోజుల్లో ట్రాక్‌కు ఇరువైపులా జనవాసాలు లేవు. ఓయూ వైపు మాణికేశ్వరీనగర్ ఏర్పాటు కాలేదు. సీతాఫల్‌మండి ప్రాంతంలో జనవాసాలు ఉన్నప్పటికీ వాటి నిర్మాణాలు పట్టాల వరకు జరుగలేదు. ఈ కారణంగా అప్పట్లో రైల్వే అధికారులు చిన్నపాటి కాజ్‌వే కూడా నిర్మించలేదు. మూడు దశాబ్దాల నుంచి ఈ ప్రాంతంలో జనవాసాలు విపరీతంగా పెరిగాయి. ఆర్ట్స్ కళాశాల-సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్ల మధ్యనున్న రైల్వే ట్రాక్‌కు ఇటు, అటు భారీ భవన నిర్మాణ సముదాయాలు వెలువడ్డాయి. దీంతో ఇక్కడి ప్రజలు తమ అవసరాల కోసం నేరుగా వెళ్లడం కోసం దారి అవసరం ఏర్పడింది.

రూ.20 కోట్లతో ప్రతిపాదనలు

సీతాఫల్‌మండి-మాణికేశ్వరీనగర్ ప్రజల రవాణా అవసరాల కోసం రైల్వేట్రాక్ కింది నుంచి (ఆర్‌యూబీ) వంతెన నిర్మించాలన్న ప్రతిపాదన మూడు దశాబ్దాల నుంచి కార్యాచరణకు నోచుకోలేదు. ఎట్టకేలకు మూడేళ్ల క్రితం ఇక్కడ రోడ్ అండర్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలకు జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అప్పట్లోనే ఆర్‌యూబీ నిర్మాణం కోసం రూ.20 కోట్లను నిధులను జీహెచ్‌ఎంసీ కేటాయించింది.

లష్కర్ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇవ్వండి

- సీఎంకు లష్కర్ సాధన సమితి వినతి



సీఎంకు అందించిన వినతిపత్రాన్ని విలేకరులకు చూపిస్తున్న లష్కర్ సాధన సమితి ప్రతినిధులు

సికింద్రాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన రూ.10 వేల కోట్ల నిధుల్లో నుంచి సికింద్రాబాద్ ప్రాంత అభివృద్ధి కోసం రూ.3500 కోట్లు కేటాయించాలని లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్ కోరారు. ఈ మేరకు లష్కర్ సాధన సమితి ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పవన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. 200 సంవత్సరాల చరిత్ర కలిగిన సికింద్రాబాద్ నగరం అన్ని రంగాల్లో వెనుకబడిందన్న విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. రహదారులు మొదలు సికింద్రాబాద్ ప్రాంత సమగ్ర అభివృద్ధి కోసం ఈ పార్లమెంట్ పరిధిలోని ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్ కు రూ. 500 కోట్లు కేటాయించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో లష్కర్ సాధన సమితి ప్రతినిధులు సాదం బాల్‌రాజ్ యాదవ్, శైలేందర్, మిట్టపల్లి బాబురావు, శ్రీకాంత్ రెడ్డి, కృష్ణ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఓజివా ప్రొడక్ట్ పేరుతో ఆన్‌లైన్‌లో మోసం

రూ.17,000 పోగొట్టుకున్న యువతి

వెంగళరావునగర్: ఓజివా ప్రొడక్ట్ పేరుతో యువతి వద్ద నుంచి ఆన్‌లైన్‌లో నగదు కాజేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన గీతాంజన సర్కార్ అనే యువతి నగరంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ స్థానిక మధురానగర్‌కాలనీలోని హాస్టల్‌లో ఉంటుంది. ఈనెల 14వ తేదీన ఓజివా అనే ప్రొడక్ట్ సంస్థ నుంచి ప్రమోషన్ కాల్ వచ్చింది. ప్రొడక్ట్ అమ్మకం ద్వారా నగదు వస్తాయని తెలిపారు. ముందుగా రూ.5,197 పంపాలన్నారు. ఆమె గూగుల్ పే ద్వారా పంపింది. జీఎస్టీ కోసమని మరోసారి రూ.11,999 పంపాలని కోరారు. వాటిని కూడా పంపింది. త్వరలోనే రూ.56,002 పంపుతామని చెప్పారు. అయితే ఆ నగదు మాత్రం రిఫండ్ కాలేదు. దీంతో తాను మోసపోయానని గ్రహించి సైబర్ పోలీసులకు తెలియజేసి అనంతరం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌బీటీనగర్ అభివృద్ధికి సహకారం



శేఖర్‌ముదిరాజ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: బస్తీల అభివృద్ధికి తనవంతు అన్నివిధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హామీనిచ్చారు. బేగంపేట డివిజన్‌లోని ఎన్‌బీటీనగర్ పాటిగడ్డ బస్తీకి నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన శేఖర్‌ముదిరాజ్ సోమవారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను బస్తీ ప్రజలతో కలిసి వచ్చి మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. బస్తీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌గౌడ్, అఖిల్, రఫిక్, ఆరీఫ్, ఇలియాజ్, సిద్దిక్, నసీమా, శారద, అమ్ములు, షెన్ను తదితరులు ఉన్నారు.

27న దళిత జర్నలిస్ట్ చైతన్య సభ




కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: దళిత జర్నలిస్ట్ ఫోరం ఆధ్వర్యంలో జరిగే దళిత జర్నలిస్ట్ చైతన్య సభ కరపత్రాలను సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సోమవారం ఆవిష్కరించారు. ఈ నెల 27న రవీంద్రభారతిలో నిర్వహించే సభకు హాజరుకావాలని కోరుతూ వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి ఆహ్వానాన్ని అందజేశారు. దళిత జర్నలిస్ట్ ఫోరం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు దొమ్మాటి శివకుమార్, ప్రధాన కార్యదిర్శ మీసాల ఎల్లేష్, దళిత జర్నలిస్టు ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు రాజు పాల్గొన్నారు.

లాలాపేటలో భారీ వర్షం



లాలాపేట బస్తీ రోడ్లపై పారుతున్న వరద నీరు



జోరుగా కురుస్తున్న వర్షం

లాలాపేట: తార్నాక, లాలాపేట ప్రాంతంలో సోమవారం సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. బస్తీలు, కాలనీల్లో నాలాలు, మ్యాన్ హోళ్లు పొంగి పొర్లాయి. లోతట్టు ప్రాంతాలైన శ్రీపురి కాలనీ, ఇందిరానగర్, సత్యానగర్ అంతర్గత రోడ్లపై వరద నీరు భారీగా ప్రవహించింది. తార్నాక చౌరస్తాలో, లాలాపేట అంబేద్కర్ విగ్రహం సమీపంలో, లాలాపేటలోని ఆర్టీసి బస్ షెల్టర్ వద్ద వర్షం నీరు నిలిచింది. భారీ వర్షానికి లాలాపేటలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

భార్య, పిల్లలను చంపుతానంటూ బెదిరింపు

గతంలో మామ గొంతుకోసి జైలుకు వెళ్ళిన నిందితుడు

వెంగళరావునగర్: భార్యను, పిల్లలను చంపుతానని బెదిరిస్తున్న వ్యక్తిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం ... పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన మహిళకు 2014లో అదే ప్రాంతానికి చెందిన వ్యక్తితో వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు ఉండగా ఆ మహిళ భర్త 2021లో మరణించాడు. దీంతో పాలకొల్లుకు చెందిన పి.సుబ్రమణ్యం అనే వ్యక్తితో 2024 మార్చినెలలో ఆమెకు రెండో వివాహమైంది. నాటి నుంచి ప్రతిరోజు మద్యం సేవిస్తున్న సుబ్రమణ్యం ఆమెను కొడుతూ చంపుతానని బెదిరిస్తున్నాడు. ఈ నేపథ్యంలో యాదగిరినగర్‌లో నివాసం ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు ఆమె వెళ్లిపోయింది. మే 24వ తేదీన సదరు మహిళ కోసం వచ్చిన సుబ్రమణ్యం ఆమె తండ్రి రామారావుపై దాడి చేసి గొంతుకోశాడు. ఈ కేసులో పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపగా, ఇటీవల తిరిగి వచ్చిన సుబ్రమణ్యం సదరు మహిళను, ఇద్దరు పిల్లలను కూడా చంపుతానని బెదిరించాడు. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన బాధితురాలు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్కూల్ అసిస్టెంట్ పోస్టులు | బీఈడీ నిరుద్యోగులతోనే భర్తీ చేయాలి

పంజగుట్ట: స్కూల్ అసిస్టెంట్స్ పోస్టులు వంద శాతం బీఈడీ అభ్యర్థులతోనే భర్తీ చేయాలని నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీలం వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఈడీ నిరుద్యోగులు భూక్యా కుమార్, పాండు, అశోక్ చౌహాన్‌లతో కలిసి ఆయన మాట్లాడుతూ సెకండ్రీ గ్రేడ్ టీచర్ల (ఎస్‌జీటీ) పోస్టులు వందశాతం డీఈడీ వారికే కేటాయించినప్పుడు సూల్ అసిస్టెంట్ పోస్టులు మాత్రం ఎస్‌జీటీ వారికి పదోన్నతుల ద్వారా 70 శాతం, బీఈడీ నిరుద్యోగుల ద్వారా కేవలం 30 శాతం భర్తీ చెయ్యడంతో బీఈడీ నిరుద్యోగులు తీవ్ర అన్యాయానికి గురౌతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగం ఉన్న వారికే పదోన్నతులు ఇస్తారు అసలు ఉద్యోగం లేనివారికి అన్యాయం ఎందుకు చేస్తారని ప్రశ్నించారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులు వందశాతం బీఈడీ నిరుద్యోగులతోనే భర్తీ చెయ్యాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌ను బోర్డ్ ఆఫ్ ప్రైయిమరీ ఎడ్యుకేషన్, బోర్డ్ ఆఫ్ సెకండ్రీ ఎడ్యుకేషన్‌గా విభజించాలని డిమాండ్ చేశారు. అప్పుడే బీఈడీ వారికి డీఈడీ వారికి ఇద్దరికీ న్యాయం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్ చౌహాన్, కిరణ్ కుమార్, యాకన్న తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతో ముందుకు సాగాలి



నూతనంగా ఎన్నికైన స్టూడెంట్ కౌన్సిల్ విద్యార్థులతో బ్రిగేడియర్ శైలేంద్ర సింగ్, ప్రిన్సిపల్ రూపిందర్ సింగ్

రసూల్‌పురా: పాఠశాల్లో స్టూడెంట్ కౌన్సిల్‌గా ఎన్నికైన విద్యార్థులు జవాబుదారి తనంతో వ్యవహరించాలని బ్రిగేడియర్ శైలేంద్రసింగ్ సూచించారు. సోమవారం పికెట్ కేంద్రీయ విద్యాలయంలో ఇన్వెస్టిచర్ వేడుక నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శైలేంద్ర సింగ్ మాట్లాడుతూ పాఠశాల నుంచి ఎంపికైన విద్యార్థులు నాయకత్వ భాధ్యతలతో సమాజసేవ లో తమ నిబద్ధతను గుర్తించి ముందుకు సాగాలని కోరారు. పాఠశాల ప్రిన్సిపల్ రూపిందర్ సింగ్ మాట్లాడుతూ విద్యార్థులు పరస్పర గౌరవం, సహకార సంస్కృతిని పెంపొందించు కోవాలని అన్ని రంగాల్లో ప్రతిభను కనబర్చాలని కోరారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన స్టూడెంట్ కౌన్సిల్ సభ్యులను శైలేంద్రసింగ్ చేతుల మీదుగా బ్యాడ్జలను తీసుకుని భాద్యతలను స్వీకరించారు. కార్యక్రమంలో పాఠశాల సీసీఏ ఇంచార్జీ అనురాగ్ సింగ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రాండ్ పేరుతో మోసం

- ప్రముఖ మద్యం బ్రాండ్‌ల బాటిళ్లలో చీప్ లిక్కర్
- విక్రయిస్తున్న నిందితుల అరెస్టు



సికింద్రాబాద్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసిన నిందితులు, స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

సనత్‌నగర్: ప్రముఖ మద్యం బ్రాండ్లకు చెందిన ఖాళీ బాటిళ్లలో చీప్ లిక్కర్‌ను నింపుతూ ఆయా మద్యం బ్రాండ్‌ల ధరలకు విక్రయిస్తున్న ముఠాను సికింద్రాబాద్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సికింద్రాబాద్ ఏఈ శ్రీనివాసరావుతో కలిసి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జగన్ మోహనరెడ్డి వివరాలు వెల్లడించారు. సికింద్రాబాద్ ఎక్సైజ్ పోలీసులు మినిస్టర్ రోడ్డులో ఆదివారం సాయంత్రం తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో 30 మద్యం బాటిళ్లను ఓ ఆటోలో అక్రమంగా తరలిస్తుండడాన్ని పోలీసులు గుర్తించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లో షాబానా రెసిడెన్సీ నుంచి తీసుకువచ్చినట్లు చెప్పాడు. దీంతో ఆ నివాసంపై దాడులు నిర్వహించారు. షబానా రెసిడెన్సీలో సోదాలు జరపగా అక్కడ 10 మద్యం బాటిళ్లతో పాటు 189 ఖాళీ మద్యం బాటిళ్లు, 100 మూతలు స్వాధీనం చేసుకున్నారు. ఒడిశాకు చెందిన ప్రమోద్ మల్లిక్ (37), జగన్నాథ్ సాహు (35)లను అరెస్టు చేశారు. అదేవిధంగా వినియోగదారుల నుంచి ఆర్డర్లను తీసుకుని ప్రమోద్ మల్లిక్‌తో మద్యం తయారుచేయించి అమ్ముతున్న ఆకుల విజయ్‌కుమార్ (38), ఉద్ధవ్‌నాయక్‌లను కూడా అరెస్టు చేశారు. వీరందరితో పాటు మద్యాన్ని రవాణా చేస్తూ పట్టుబడ్డ అనిల్‌కుమార్‌ను అరెస్టు చేసి విచారించారు. మద్యాన్ని ఢిల్లీ, హర్యానా, గోవాల నుంచి మద్యం తెప్పించామని చెబుతూ విక్రయిస్తున్నారు. ఈ మేరకు వారిని రిమాండ్‌కు తరలించారు.

బోరబండ సీపీఎం కార్యదర్శిగా శేషగిరిరావు

రహమత్‌నగర్ (బోరబండ): బోరబండ సీపీఎం శాఖ అధ్యక్షునిగా శేషగిరిరావు ఐదోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బోరబండలో సోమవారం జరిగిన మహాసభలో శేషగిరిరావును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎం పక్షాన ప్రజాపోరాటాలు చేసేందుకు తాను వెనుకాడనని స్పష్టం చేశారు. అంతకు ముందు పార్టీ జెండాను ఆవిష్కరించి, సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సమావేశంలో నగర నాయకులు అజయ్‌బాబు, సీపీఎం జోన్ కన్వీనర్ రాపర్తి అశోక్, లక్ష్మణ్, గంగులప్ప, ఎండి యాష్, కృష్ణ, ఎండి నయూమ్, పటేల్, శ్రీను. విష్ణు మూర్తి, సాబేర్ తదితరులు పాల్గొన్నారు.